క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

సంతబొమ్మాళి: నౌపడలోని లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు బరాడ విశ్వగురుశర్మ, నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దుర్గారావు బాబ్జీ, లక్ష్మి దంపతులు నిరుపేదలకు వస్త్రదానం చేశారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న కంచిలి బ్రాంచి మేనేజర్ నరేష్ తదితరులు

కంచిలి: రక్తదానం ప్రాణదానంతో సమానమని వక్తలు పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ నాయకుడు కామ్రేడ్ తారక్‌నాథ్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రం కంచిలి ఎస్‌బీఐ బ్రాంచి ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా.. కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, బారువ, సిలగాం బ్రాంచిల సిబ్బంది, స్థానిక యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో కంచిలి, సోంపేట, కవిటి బ్రాంచ్ మేనేజర్లు నరేష్, గురుమూర్తి, అశోక్ పాల్గొన్నారు.

25వ తేదీలోగా విద్యార్థుల వివరాలు నమోదు



మాట్లాడుతున్న ఎంఈవో విశ్వనాథం

ఇచ్ఛాపురం రూరల్: బడిలో చేరిన నూతన విద్యార్థులకు సంబంధించిన వివరాలను ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల విద్యాశాఖాధికారులు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం అన్నారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయం పాలన పాటించాలని, మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు అందజేయాలని అన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

- యూటీఎఫ్ డిమాండ్

కంచిలి: ప్రభుత్వం ఎంత ప్రతిష్టాత్మకంగా బదిలీలు చేసిందో అంతే ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి, పొజిషన్ ఐడి క్రియేట్ చేయించి సకాలంలో జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు డిమాండ్ చేశారు. కంచిలిలో శుక్రవారం సమావేశమై మాట్లాడారు. పాఠశాలలో కొత్తగా చేరిన వారికి స్టూడెంట్ కిట్లను సకాలంలో అందించాలన్నారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి ఎం.మురళి ప్రకాష్, కంచిలి మండల అధ్యక్షుడు మురళీనాయక్, ప్రధాన కార్యదర్శి నల్లాన రవి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు సుదర్శన్ బెహరా పాల్గొన్నారు.

పరారీలో ఉన్న వారిని అరెస్టు చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

సోంపేట: ఎక్సైజ్ నేరాల్లో పరారీలో ఉన్న ముద్దాయిలను తక్షణమే అరెస్టు చేయాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. సోంపేట ఎక్సైజ్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. వార్షిక సంవత్సరంలో నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసులు నమోదైనప్పటికీ.. పరారీలో ఉన్న వారి వివరాలు సేకరించి తక్షణమే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచాలన్నారు. ఎక్సైజ్ సీఐ జి.విరమణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస రావు, టాస్క్‌ఫోర్స్ సీఐ మధుకుమార్, ఎస్సైలు కళ్యాణి, కుమార్, గురుమూర్తి, సుజాత పాల్గొన్నారు.

అధిక కేసులు రాజీకి సహకరించాలి



మాట్లాడుతున్న జడ్జి నిర్మల

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయంలో జూలై ఐదో తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులు రాజీ జరిగేలా న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల కోరారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

చతికిలబడింది!



టి.బరంపురం పాఠశాలలో 46 మంది విద్యార్థులకు బోధన చేస్తున్న ఏకోపాధ్యాయురాలు

- సమస్యల వలయంలో సర్కారు బడులు
- వెంటాడుతున్న ఉపాధ్యాయుల కొరత
- మౌలిక సదుపాయాలకు నోచుకోని విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ గాడితప్పుతోందనే విమర్శలు వస్తున్నాయి. పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి సర్కార్ బడుల్లో కనిపిస్తోంది. చాలా పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల్లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన 'నాడు–నేడు' పథకం పనులు నిలిచిపోవడంతో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు దూరమయ్యాయి. మరోవైపు ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. ఇచ్ఛాపురం మండలంలో 54, మున్సిపాలిటీలో 19 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా 141 మంది ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేసేవారు. అయితే ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో చాలా మంది వెళ్లగా.. ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను ఖాళీల్లో భర్తీ చేసినప్పటికీ ఇంకా 52 పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.



కె.శాసనాం పాఠశాలలో 160 మందికి వంట చేస్తున్న ఇద్దరు వంట కార్మికులు

పది పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు..

గత ప్రభుత్వ హయాంలో మండలంలో ఒకటో, రెండో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా, ఇప్పుడు ఏకంగా పది పాఠశాలలు ఏకోపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. బూర్జపాడు, పెద్ద లక్ష్మీపురం, బెన్నుగానిపేట, టి.బరంపురం, పాత శాసనాం, మశాఖపురం, సైదాలపుట్టుగ, పాయితారి, మునిభద్ర, బొడ్డఖాళీ, అయ్యవారిపేట పాఠశాలల్లో ఏకోపాధ్యాయులున్నారు. బూర్జపాడు ప్రాథమిక పాఠశాలలో 76 మంది విద్యార్థులు ఉండగా, బెన్నుగానిపేటలో 21 మంది ఉన్నారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతుండగా, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఇష్టపడక ప్రైవేటు బడుల్లో చేర్పిస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదు తరగతులకు ఒకే టీచరు ఉంటారు. అన్ని తరగతులకు, అన్ని సబ్జెక్టులూ ఒక్కరే బోధించాలి. విద్యార్థులందరూ ఒకే గదిలో కూర్చుంటారు. దీంతో విద్యార్థులు కనీస సామర్థ్యాలు నేర్చుకోలేరు. ఫలితంగా పిల్లల స్థాయికి తగ్గ జ్ఞాన సముపార్జన చేయలేరంటూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల నుంచి తమ పిల్లల్ని తీసుకుపోతున్నారని ఏకోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

160 మంది విద్యార్థులకు ఇద్దరే వంటవారు

కొత్త శాసనాం ప్రాథమిక పాఠశాలలో 160 మంది విద్యార్థులు చదువుతుండగా, వీరందరికీ ఇద్దరు మాత్రమే వంట చేస్తున్నారు. దీంతో వంట చేయడం తమకు భారంగా ఉందంటూ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 3, 4, 5 తరగతుల విద్యార్థులు పక్కనే ఉన్న కె.శాసనాం ఉన్నత పాఠశాలకు వెళ్లిపోవడంతో విద్యార్థులతో పాటు ఇద్దరు వంట నిర్వాహకులు కూడా వెళ్లిపోయారు. ఈ విద్యా సంవత్సరం 4, 5 తరగతి విద్యార్థులు తిరిగి ప్రాథమిక పాఠశాలలో చేరినప్పటికీ వంట నిర్వాహకులు మాత్రం ప్రాథమిక పాఠశాలలో వంట చేసేందుకు ఇష్టపడక పోతుండటంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

త్వరలో భర్తీ చేస్తాం



ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై దృష్టిసారించాం. కొత్త డీఎస్సీ ద్వారా పూర్తి స్థాయిలో సబ్జెక్ట్ ఉపాధ్యాయులను ఖాళీ ప్రదేశాల్లో భర్తీ చేస్తాం. అంతవరకు 1998, 2008 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులను కౌన్సెలింగ్ ప్రక్రియలో తాత్కాలికంగా భర్తీ చేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది.

– కురమాన అప్పారావు, ఎంఈవో, ఇచ్ఛాపురం

సారా రహిత గ్రామాలే లక్ష్యం

- ఎక్సైజ్ ఏసీ రామచంద్రరావు

టెక్కలి: నాటుసారా రహిత గ్రామాలే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని ఎక్సైజ్ శాఖ ఏసీ పి.రామచంద్రరావు సూచించారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలను అరికట్టాలన్నారు. టెక్కలి ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారా ప్రభావితమైన నందిగాం, మెళియాపుట్టి మండలాల్లో గుర్తించిన 35 గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించి పూర్తి స్థాయిలో సారా రహిత గ్రామాలుగా మార్చాలని ఆదేశించారు. ఇప్పటికే 17 గ్రామాల్లో సారా రహిత గ్రామాలుగా మార్చినట్లు వెల్లడించారు. సారా తయారీ, విక్రయదారులపై కేసులు నమోదు చేయాలని, మరోసారి నేరానికి పాల్పడితే రెండు లక్షల రూపాయల వరకు జరిమానా విధించాలని స్పష్టం చేశారు. అలాగే అటవీ శాఖాధికారులతో సమన్వయంగా కొన్ని గ్రామాల్లో విస్తృతమైన తనిఖీలు చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏఈఎస్ గోపాలకృష్ణ, సీఐ షేక్ మీరా సాహెబ్ పాల్గొన్నారు.



టెక్కలి: ఎక్సైజ్ అధికారులతో సమీక్షిస్తున్న ఏసీ రామచంద్రరావు

సారా తయారీకి బెల్లం అమ్మితే చర్యలు

పలాస: గిరిజన ప్రాంతాల్లో నాటు సారా తయారీకి బెల్లం అమ్మితే తగిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు జిల్లా అసిస్టెంటు కమిషనర్ పైడి రామచంద్రరావు బెల్లం వ్యాపారస్తులను హెచ్చరించారు. పలాసలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన సంబధిత అధికారులతో సమీక్షించారు. నవోదయంలో భాగంగా శ్రీకాకుళం జిల్లాను సారా రహిత ప్రాంతంగా ప్రకటించడానికి తగిన విధంగా కృషి చేయాలని కోరారు. అందుకు తగిన అన్ని రకాల చర్యలను తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం పలాసలోని బెల్లం వ్యాపారులతో సమావేశం అయ్యారు. వారందరిని సెక్షన్ 128 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్టు ప్రకారం బైండోవర్ కావాలని సూచించారు. బెల్లం అమ్మినట్టయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ మద్రాపు గోపాలక్రిష్ణ , సీఐ మల్లికార్జునరావు ఉన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనే ధ్యేయం

టెక్కలి రూరల్: (కోటబొమ్మాళి): క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతోందని కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ వరుణ్ తెలిపారు. శుక్రవారం దంత ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని సరియాపల్లి గ్రామంలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా క్షయ వాధి లక్షణాలు, వాటి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే క్షయవ్యాధి తీవ్రతతో పాటు వ్యాప్తిని సైతం అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి పీహెచ్‌సీ సూపర్‌వైజర్, టీబీ సూపర్‌వైజర్లు, దంత ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై విచారణ చేయాలి

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని మండాపొలం కాలనీలో గతంలో పేదల కోసం ఇచ్చిన ఇళ్ల స్థలాలపై విచారణ చేయాలని సీటి సంఘం అధ్యక్షుడు మాజీ సత్తారు వెంకటరమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అప్పట్లో సుమారు 16 ఎకరాల్లో 561 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు పూర్తిగా అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. దీనిపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి అర్హులైన వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టులపై దాడులు హేయం



క్రిష్టారావుకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న జర్నలిస్టులు

కంచిలి: సమాజానికి నిత్యం సమాచారాన్ని అందిస్తూ, ప్రజల్ని చైతన్య పరిచే జర్నలిస్టులపై దాడులు చేయడం మిక్కిలి హేయనీయమని మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి క్రిష్టారావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జర్నలిస్టుల సమస్యలు వారి భవిష్యత్తు కార్యాచరణ, జర్నలిస్టుల రక్షణ చట్టాల కోసం ఈ నెలలో ఒంగోలు కేంద్రంగా నిర్వహించనున్న ఏపియుడబ్ల్యూజే 36వ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆయన కోరారు. ఈ నెల 24, 26 తేదీల్లో ఒంగోలులో చేపట్టనున్న మహాసభలు విజయవంతానికి సహకరించాలని ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చిక్కోలు జగదీష్ ఆధ్వర్యంలో సోంపేట ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కొత్తకోట నవీన్ కుమార్, పడాల నరేష్‌లు శుక్రవారం క్రిష్టారావును కలిసి కోరారు. ఈ సందర్భంగా ఆయన జర్నలిస్టులపై, పత్రికా కార్యాలయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు.

అత్తకు తలకొరివిపెట్టిన కోడలు



పద్మావతికి ఆఖరి స్నానం చేయిస్తున్న స్థానిక మహిళలు

కాశీబుగ్గ: పలాసలో మున్సిపల్ కార్యాలయం సమీపంలోని రాజీవ్‌నగర్‌లో శుక్రవారం చిత్తూరు పద్మావతి (90) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మరణించింది. కుమారుడు ఇదివరకే అనారోగ్యంతో మరణించడంతో కోడలే అన్నీ తానై అంత్యక్రియలు పూర్తి చేసింది. స్థానిక మహిళలు సహకారం అందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మందస: యోగాసనాలు వేస్తున్న సిరిపురం పాఠశాల విద్యార్థులు



మందస: యోగా సాధనలో సొండిపూడి పాఠశాల విద్యార్థులు



టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు, వాకర్స్




కాశీబుగ్గ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాలో భాగంగా మానవహారంలో విద్యార్థులు



కాశీబుగ్గ: యోగా సాధనలో విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వక్తలు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, కార్యాలయాల్లో శుక్రవారం యోగాపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. నిత్యం యోగా చేయడం ద్వారా జ్ఞాపక శక్తిని పెంపొందించుకోవచ్చునన్నారు. యోగాను దినచర్యగా మార్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

1503 అర్జీలు పరిష్కారం



అర్జీదారులకు పరిష్కార పత్రాలను అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ప్రజా సమస్యల వేదిక ద్వారా 2285 అర్జీలు వస్తే అందులో 1503 పరిష్కారమయ్యాయని ఉప తహసీల్దార్ శ్రీహరి తెలిపారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్జీదారులకు పరిష్కార పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ.. కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించడం ద్వారా రెవెన్యూశాఖ అందిస్తున్న సేవలపై ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు దోహదపడుతుందని అన్నారు. సీఎస్ డీటీ సంతోష్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాకిట్లు పంపిణీ



మందస మండలం సొండిపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులకు రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. విద్యాకమిటీ చైర్మన్ మాకమ్మమహేష్, మాజీ చైర్మన్ యానాది వాసుదేవ్, హెచ్ఎం సుందర సాల్మన్ మాట్లాడుతూ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్, ఎస్.అరుణ్ కుమారి, చంద్రశేఖర్, ఆర్.చంటిబాబు, కె.వెంకటరమణ, ఎస్.విజయ్, అప్పారావు, తులసీదాస్ పాల్గొన్నారు. – మందస

దినచర్య పుస్తకాలు అందజేత



వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారథి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ కుసుమ హేమంత్‌రావు తన సొంత డబ్బులతో సమకూర్చిన దినచర్య పుస్తకాలను శుక్రవారం అందజేశారు. దినచర్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యవ్వారి కాంతారావు, పాఠశాల కమిటీ చైర్మన్ దున్న కవిత, ఉపాధ్యాయులు గుంటు కొదండరావు, ఎం.హరినాథ్, ఎస్.పాపారావు, బి.అన్నపూర్ణ, కె.మాధవరావు ఉన్నారు. – వజ్రపుకొత్తూరు రూరల్

పూర్వ విద్యార్థుల ఔదార్యం



సంతబొమ్మాళి మండలం బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. తమవంతుగా రూ. 12 వేలు విలువైన ప్రింటర్‌ను చదువుకున్న పాఠశాలకు బహుమతిగా శుక్రవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. – సంతబొమ్మాళి

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



పలాస: సత్కారం పొందిన రెవెన్యూ సిబ్బంది



టెక్కలి: కార్యక్రమంలో అధికారులు



నందిగాం: మాట్లాడుతున్న డీటీ రామారావు



సోంపేట: పాణిగ్రాహిని సన్మానిస్తున్న సిబ్బంది



కంచిలి: రిటైర్డు ఉద్యోగులను సత్కరిస్తున్న సిబ్బంది



కాశీబుగ్గ: సత్కారం పొందుతున్న రిటైర్డు ఉద్యోగులు

పలాస: పలాసలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన, ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులకు సత్కరించి గౌరవించారు. ఉద్యోగ విరమణ చేసిన డీటీ వాసు, ఆర్ఐ ఖగేశ్వరరావు, వీఆర్వోలు చంద్రమోహన్, ఎర్రయ్య, లొత్తూరు సచివాలయం సర్వేయరు బాలసుందర్, వీఆర్ఏ రూపావతిలకు సన్మానించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ డి.టి.గిరిరాజు మాట్లాడుతూ.. రెవెన్యూ దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు తమ ఉద్యోగ ధర్మాలను పాటించి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు.

- **టెక్కలి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు రెవెన్యూ అధికారులు అందజేస్తున్న సేవలను వివరించారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.రవికుమార్, నాయకులు బి.శేషగిరి, ఎం.రాము, కె.లవకుమార్ పాల్గొన్నారు.
- **నందిగాం:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.రామారావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆర్ఐ పోలాకి కామేశ్వరరావు, విశ్రాంత వీఆర్వోలు పి.రామారావు, ఫాల్గుణరావు, సీతారామమూర్తి, శ్యామసుందరరావు, మోహనరావునాయుడులను సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. మండల సర్వేయర్ హనుమంతురావు, ఆర్ఐ సింహాచలం, వీఆర్వోలు, గ్రామసర్వేయర్లు పాల్గొన్నారు.
- **సోంపేట:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ మహేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్రాంత ఆర్ఐ కూర్మనాథ్ పాణిగ్రాహిని సిబ్బంది సత్కరించారు. ఆర్ఐలు కిరణ్, డిల్లీ, సర్వేయర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- **కంచిలి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ డి.సంతోష్ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు తహసీల్దార్ అశోక్‌రావు పాణిగ్రాహి, రిటైర్డు వీఆర్వోలను దుశ్శాలువలతో సన్మానించి వారి సేవలను సిబ్బంది కొనియాడారు.
- **కాశీబుగ్గ:** పలాస మండల తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా రెవెన్యు దినోత్సవాన్ని సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత తహసీల్దార్ రామారావు, ఆర్ఐ కంచరాన ఖగేశ్వరరావు, వీఆర్వోలు ఎర్రయ్య, చంద్రమోహన్, సర్వేయర్ బాలచందర్, వీఆర్ఏ రూపావతిలను డిప్యూటీ తహసీల్దార్ గిరిరాజు చేతుల మీదుగా సత్కరించారు.

బుచ్చయ్య చౌదరికి మతిభ్రమించింది


- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్



మాట్లాడుతున్న తిలక్

టెక్కలి: టీడీపీలో సీనియర్ నాయకుడైన గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ఆ పార్టీ పెద్దలు పట్టించుకోకపోవడంతో మతిభ్రమించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాట తిలక్ అన్నారు. కాటికి కాలు చాపే వయసులో మంత్రి పదవి కోసం ఆరాట పడుతూ జగన్‌పై నోటికి ఇష్టం వచ్చినట్లుగా ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కూటమి నాయకులంతా డైవర్షన్ రాజకీయాలపై ఆధార పడుతూ ప్రతిపక్ష నేత మాట్లాడిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ తలపెట్టిన వెన్నుపోటు ర్యాలీలతో పాటు జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పర్యటనలకు ప్రజల నుంచి విశేషమైన స్పందన రావడంతో కూటమి నాయకులకు గుబులు పట్టుకుందన్నారు. సినిమా డైలాగులు వాడొద్దు అని నీతి వాక్యాలు పలుకుతున్న పవన్ కళ్యాణ్ మాత్రం తోలు తీస్తా, తొక్క తీస్తా, నార తీస్తా, గొంతు పిసికి చంపుతా, బట్టలు ఊడదీసి తంతా అంటూ ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో పూర్తిగా వైఫల్యం చెందడమే కాకుండా ప్రతిపక్ష నేతకు అత్యంత ప్రజాధరణ రావడంతో కూటమి నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా దానిని మాజీ సీఎం జగన్‌తో పాటు నాయకులపై ఆపాదించాలని చూస్తున్నారన్నారు. జగన్‌కు ఏదైనా హాని తలపెట్టాలని చూస్తే తమతో పాటు ప్రజల నుంచి తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

వృద్ధుడు అదృశ్యంపై ఫిర్యాదు



చిన్నారావు

కాశీబుగ్గ: అనారోగ్యం కారణంగా కుటుంబ సభ్యులకు భారం కాకూడదని ఇంటి నుంచి వృద్ధుడు వెళ్లిపోయాడు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వవార్డు సూదికొండకు చెందిన ఎలుకల చిన్నారావు (75) అనారోగ్య కారణాలతో ఇంటి నుంచి ఆటో ఎక్కి బయటకు వచ్చేశారు. తరువాత గమనించిన కుటుంబ సభ్యులు ఆయన కోసం వెతకడం ప్రారంభించారు. అయితే ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా తారసపడితే 99893 06091 నంబర్‌కు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.